

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు..

నులి పురుగు మాత్రల పంపిణీ

బాసర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆదివారం నులి పురుగుల మాత్రలు అల్బెండాజోల్ టాబ్లెట్‌లను పంపిణీ చేసినట్లుగా వీసీ గోవర్దన్ తెలిపారు. విద్యార్థులకు పోషణ, రోగనిరోధక శక్తి, ఏకాగ్రతను ప్రభావితం చేసే నులిపురుగు నివారించడంలో అల్బెండాజోల్ మాత్రలు ఎంతో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి సిబ్బంది, తదితరులున్నారు.

అడెల్లి పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన న్యాయమూర్తులు

సారంగాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో ఆదివారం న్యాయమూర్తులు శ్రీవాణి, భవిష్య, రాధికలు పూజలు చేసి ప్రత్యేక మొక్కులను మొక్కారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతి నిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది పాలక మండలి శాలువాలతో సన్మానించారు.



ఆలయంలో మొక్కులు మొక్కుతున్న న్యాయమూర్తులు

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కుంటాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే గ్రామస్థులతో పాటు పక్క గ్రామాల ప్రజలు సైతం గజ్జలమ్మ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్ర మైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కుంటాల గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తమ పిల్లలకు అమ్మవారి ఆలయంలో అక్షర శ్రీకర పూజలు జరిపిస్తున్న భక్తులు

బాసరలో భక్త జన సందోహం

- గోదావరిలో కార్తీక స్నానాలు, సరస్వతి అమ్మవారి ఆలయంలో అక్షర శ్రీకార పూజలు

బాసర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, ఆదివారం సెలవు దినం కలిసి రావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. భక్తులు ఉదయం నుంచే గోదావరి నదికి చేరుకుని కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదీ తీరంలో కొలువైన శివాలయంలో పూజలు పూర్తి చేసుకున్న భక్తులు, అనంతరం జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ఆలయం వద్ద భక్తుల సందడి దినమంతా కొనసాగింది.



అమ్మవారి సన్నిధిలో ఓనమాలు దిద్దుతున్న చిన్నారి

● భారీగా అక్షర శ్రీకారాలు

కార్తీక మాసం పర్వదినాలు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తమ పిల్లలకు అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాలు దిద్దించేందుకు ఆలయ ప్రాంగణం భక్త జన సందోహంతో నిండిపోయింది.

కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లతో కలిసి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయ్యారు. నిర్మల్ జిల్లాలో రహదారుల అభివృద్ధి అంశంపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలిపారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు విషయంలో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

విలువ సుమారు రూ.200 కోట్లు..?

29 ఎకరాలకు ఎసరు!

సర్వే నెంబర్ 534.. నేతలకు హాట్ స్పాట్..

- అప్పటి బీఆర్ఎస్ సర్కారులో నేతల కబ్జా
- తాజాగా ఆక్రమణల తొలగింపులో అధికారుల దూకుడు
- కలెక్టర్, ఎమ్మెల్యే సూచనలతో రంగంలోకి రెవెన్యూ యంత్రాంగం?



నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్ ప్రహరీ గోడను కూల్చిన అధికారులు

నిర్మల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 200ల కోట్ల విలువైన భూమికి రాజకీయ పార్టీల నేతలు ఎసరు పెట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ విలువైన భూమిని కబ్జాలు పెట్టిన నేతలు ఇప్పుడు కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా స్థానిక శాసన సభ్యుడు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ వ్యవహారంపై చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుండడంతో అధికారులు చేసేది లేక కూల్చివేతలకు దిగుతున్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సైతం ఈ వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు కనిపిస్తున్నది.

సర్వే నెంబర్ 534.. ఇదీ కథ..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య నగర్ కాలనీలో ఉన్న 534 సర్వే నెంబర్‌లో ఉన్న ఆక్రమణల తొలగింపు మొదలైంది. 29 ఎకరాల అసైన్డ్ భూమి మూడు దశాబ్దాలుగా ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ... అధికారులు సర్వే చేయడం ఆ తర్వాత వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. ఇంతకాలం ఎవరు పట్టించుకోకపోగా తాజాగా కొద్దిరోజుల నుండి నిర్మల్ రెవెన్యూ అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు మొదలుపెట్టారు. ఈ పరిణామం జిల్లాలో సంచలనం రేపుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద మొత్తంలో ఆక్రమణలు జరిగాయి. దీనికి సంబంధించిన ఆక్రమణల తొలగింపు మొదలుపెట్టారు. ఇదే సర్వే నెంబర్‌తో పాటు ఆనుకుని ఉన్న పలు సర్వే నెంబర్లలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారుల్లో కలకలం మొదలైంది. గతంలో భారత్ రాష్ట్ర సమితి పార్టీలో జడ్పీటీసీగా గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన లక్ష్మణచాంద మండల నేత ఒకరు, భారతీయ జనతా పార్టీలో చేరిన నిర్మల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఒకరు ఈ సర్వే నెంబర్ సమీప సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు వి నిపిస్తున్నాయి. అసైన్డ్ భూములను అప్పటి రెవెన్యూ అధికారులతో కలిసి పట్టాలు చేయించుకున్నారు. అప్పట్లో ఓ తహసీల్దార్ భారీ అవినీతికి పాల్పడడంతో ఈ వ్యవహారం జరిగింది. ఆ తహసీల్దార్ అప్పట్లో సస్పెన్షన్ అయినప్పటికీ... కబ్జాకు గురైన భూములు మాత్రం ఆ నేతల చేతుల్లోనే ఉన్నాయి. కొన్ని భూములను ప్లాట్లు చేసి అమ్మినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిర్మల్‌లో ప్రభుత్వ భూముల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎమ్మెల్యే సీరియస్.. కలెక్టర్ యాక్షన్ షురూ

ఇటీవలనే నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి కలెక్టర్ అభిలాష అభినవ్, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి వర్షాకాలంలో వస్తున్న ఇబ్బందుల కారణంగా ఎక్కడ కూడా సమస్యలు ఎదుర్కోకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఇదే సందర్భంగా పట్టణంలోని దివ్య నగర్ కాలనీలో ఉన్న 534 సర్వే నెంబర్ ఆక్రమణలపై చర్చ వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల అవసరాల కోసం భూములు వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఏలేటి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె కూడా సీరియస్‌గానే స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ అసైన్డ్ భూముల ఆక్రమణలను ఉపేక్షించవద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కలెక్టర్ ఆదేశాల మేరకు అనుకున్నట్లుగానే అధికారులు రంగంలోకి దిగా రు. నిర్మల్ అర్బన్ తహసీల్దార్ స్వయంగా తన బృందంతో అక్కడికి చేరుకొని ఆక్రమణల తొలగింపు మొదలుపెట్టారు. కొన్నిచోట్ల గేట్లను తొలగించడంతో పాటు ప్రహరీలను తొలగించి కలెక్టర్‌కు నివేదిక పంపారు. మిగతా ఆక్రమణలు కూడా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అయితే తహసీల్దార్‌పై ఒత్తిళ్లు మొదలయ్యాయి. అనేక ప్రభుత్వ కార్యాలయాలు, మెడికల్ కళాశాల హాస్టల్ భవనం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల కోసం ఈ స్థలాన్ని వినియోగించేందుకు అవకాశం కలుగుతుందని నిర్మల్ జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

ఇది దురుద్దేశమే...

534 సర్వే నెంబర్‌లో అక్రమాల తొలగింపుపై అధికారుల చర్యలను కొందరు తప్పుపడుతున్నారు. దురుద్దేశపూర్వకంగా ఈ చర్యలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్లుగా ఆధీనంలో ఉన్న ఈ స్థలాలపై రాజకీయ కక్షతో ఇలాంటి చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. ఆక్రమణల తొలగింపుకు వచ్చిన అధికారులతో కొందరు వాదనకు దిగారు. అయినప్పటికీ తొలగింపు ఆపలేదు. ఆధారాలతో రావాలని కొంత సమయం ఇచ్చినట్లు చెబుతున్నారు.

భద్రత భావనను బలపరిచే లక్ష్యమే పోలీస్ అక్క

- జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హృదయాల్లో భద్రత భావనను బలపరిచే లక్ష్యమే పోలీస్ అక్క కార్యక్రమం అని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శనివారం రాత్రి జిల్లాలోని అన్ని పోలీస్ అక్క టీమ్‌లు తమ తమ స్టేషన్ పరిధిలోని కేజీబీవీ పాఠశాలల్లో పిల్లలతో కలిసి 24 గంటలు స్కూల్‌లోనే గడిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులతో నేర్పిస్తున్న ఈ కార్యాచరణ ద్వారా వారు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. దీని ఫలితంగా విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. వారిలో ఉండే భయభ్రాంతులు అభద్రత భావం క్రమంగా తొలగిపోతుందన్నారు.



విద్యార్థులతో పోలీస్ అక్క

యూనివర్సిటీ ప్రధాన ప్రవేశద్వారం



- బాసర ఆర్జీయూకేటీ టెండర్‌లో వెలుగు చూస్తున్న అక్రమాలు

అధికారుల అండ అక్రమాల కొండ

బాసర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లో మెస్ టెండర్ల వ్యవహారం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఈ టెండర్ల ప్రక్రియలో భారీ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ టెండర్ల వెనుక పెద్ద ఎత్తున కుంభకోణం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అధికారులు కాంట్రాక్టర్ల సిండికేట్ చెప్పినట్లుగా టెండర్లను ఖరారు చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తెర వెనుక పెద్ద అధికారుల అండతో కొండంత అవినీతి జరిగిందని అర్థమవుతోంది. విధి విధానాలను గాలికొదిలి, కేవలం తమకు అనుకూలంగా ఉన్న వారికి కాంట్రాక్ట్‌లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నించారనే ఆరోపణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మెస్ టెండర్ల వెనుక భారీ కుంభకోణంలో నార్త్ ఇండియాకు చెందిన కంపెనీలు కీలక పాత్ర పోషించినట్లు సంచలన విషయాలు వెల్లడవుతున్నాయి.



ఫుడ్ పాయిజన్‌తో అస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

● కాంట్రాక్టులపై అనుమానాలు

ఈ టెండర్లలో నార్త్ ఇండియాకు చెందిన రెండు కంపెనీలకు కాంట్రాక్టులు దక్కడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక కంపెనీకి కాంట్రాక్ట్ కట్టబెట్టడం కోసం, ఎక్కువ అర్హత ఉన్న మరొక సంస్థను అధికారులు ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మరో నార్త్ ఇండియా కంపెనీకి కనీస అనుభవ అర త లేకపోయినా నిబంధనలు సడలించి కాంట్రాక్టు ఇచ్చారని తెలిసింది. అంతేకాకుండా, మొత్తం మెస్ కాంట్రాక్టుల విషయంలో ఈ నార్త్ ఇండియా కంపెనీకి సంబంధించిన వ్యక్తులే పెద్ద అధికారుల వద్ద మిగిలిన రెండు మెస్ కాంట్రాక్టర్ల విషయంలో రాజీ కుదిర్చినట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని ద్వారా టెండర్ల ప్రక్రియ మొత్తం ముందుగా నిర్ణయించుకున్న విధంగానే జరిగిందని స్పష్టమవుతోంది.ఈ వ్యవహారంలో అత్యంత విచిత్రమైన, కీలక అంశం ఏమిటంటే... ఏడేళ్లుగా మెస్ కాంట్రాక్ట్‌లను నడిపించిన సంస్థ వ్యక్తి ఈ ఉత్తరాది కంపెనీలకు బినామీగా టెండర్లలో పాల్గొని తిరిగీ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు యూనివర్సిటీలో చర్చ జరుగుతుంది.

● ఆ కంపెనీకి మళ్లీ కాంట్రాక్ట్

మెస్ కాంట్రాక్టుల విషయంలో పలుమార్లు అపఖ్యాతి పాలైన ఒక సంస్థకు అధికారులు మళ్లీ కాంట్రాక్టు అప్పగించడం విమర్శల కు దారి తీస్తోంది. ఆహారంలో కప్పలు, పురుగులు, కనిపించడం, ఫుడ్ లైసెన్స్ సస్పెన్షన్ వంటి తీవ్రమైన రిమార్కులు ఉన్నప్పటికీ, ఆ సంస్థను బ్లాక్లిస్టులో పెట్టాల్సిన అధికారులు తిరిగీ టెండర్‌లో ఎంపిక చేయడం గమనార్హం.

ఫుడ్ పాయిజన్ మరచి..కాంట్రాక్టు

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో వందలాది మంది విద్యార్థులను ఆస్పత్రి పాలు చేసిన ఫుడ్ పాయిజన్ ఘటనకు కారణమైన సంస్థల్లో ఒక దానికి తిరిగి కాంట్రాక్టు కట్టబెట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఫుడ్ పాయిజన్ ఘటనపై అప్పట్లో బాసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా, యూనివర్సిటీ అధికారులు నిందితులైన సంస్థలపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం, వారికి మళ్లీ కాంట్రాక్టు అప్పగించడంపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సోయా కొనుగోళ్లలో జాప్యం

- రైతుల్లో ఆందోళన

కుంటాల, నవంబరు, 16 : (ఆంధ్రజ్యోతి) : దళారీ వ్యవస్థను నిర్మూలించటం, రైతులకు గిట్టు బాటు ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు రైతుల కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కాని అధికారులు అతిగా ప్రవర్తించడం, కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యమా లేక రైతుల నిర్లక్ష్య మో కాని కుంటాల మండలంలో సోయా కొనుగోళ్ల లో మరింత జాప్యం నెలకొంది. గత 15 రోజుల క్రితం కుంటాల మండలంలో సోయా కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. అ ప్పటి నుంచి స్థానిక సహకార సం ఘం సిబ్బంది సోయాలను తూకం వేస్తున్నారు. గత మూడు నాలుగు రోజుల క్రితం లారీల సమస్య ఉన్న ప్పటికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లారీలు రాగా తూకం వేసిన సోయాలను లారీల్లో వేసి గోదాంకు పంపారు. గోదాం అధికారులు సోయాలు నాణ్యమైనవిగా లేవని లారీలను వాపసు పంపారు. దీంతో అధికారులు చేసేదేమి లేక కొను గోళ్లను ఆపివేశారు. దీం తో మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరు, అంబకంటి, పెంచికల్ పాడ్, ఓలా, లింబా (కే) గ్రామాలలో ప్రస్తుతం ప్రభుత్వం సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లు చేపడుతుంది. లారీలు వాపసు రావడంతో సహకార సంఘం అధికారులు తాము చేసేదేమి లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికే దాదాపు 45 రోజుల క్రితం సోయా కోత కోసి గిట్టుబాటు ధరకు విక్ర యించుకుందామనుకున్న రైతన్నలకు అధికారుల నిబంధన లు శాపంగా మారాయి అకాల వర్షాలతో దిగుబడులు తగ్గడంతో పాటు సోయాలు కొంత మేర నల్లబరాయి, అయితే అధికారులు మాత్రం సోయాలు నాణ్యంగా లేవని లారీలు వాప సు పంపడంతో అధికారులు చేసేదేమి లేక సోయా కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులు చేసేదేమి లేక తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సత్వరమే కొనుగోళ్లు వేగవంతం చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా అధికారులు చూడాలని సంబంధిత రైతులు పేర్కొంటున్నారు.



కుంటాలలో గోదాంకు పంపిన తర్వాత వాపసు వచ్చిన లారీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న బాల్య మిత్రులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఆర్ఆర్ మెమోరియల్ హైస్కూల్‌లో 2015-2016 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పాత స్నేహితులు సుదీర్ఘ విరామం తర్వాత ఒకచోట చేరి బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలకు కారణమైన గురువులను సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉల్లాసభరిత వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

» ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కారితో రామారావ్ పాటిల్

భైంసా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధి నుంచి ఇతర రాష్ట్రాలకు అనుసందానించే రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మహారాష్ట్రంలోని నాగ్‌పూర్ పట్టణంలో ముథోల్ ఎమ్మెల్యే పాటిల్ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు ఈటేల రాజేందర్‌లతో కలిసి కేంద్రమంత్రి నితిన్ గడ్కారిని కలిసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాటిల్ చదువుల తల్లి కొలువైన బాసర అమ్మవారి క్షేత్రం నుంచి మహారాష్ట్రంలోని మహోర్ పుణ్య క్షేత్రం వరకు జాతీయ రహదారి అనుసందానానికి కేంద్ర ప్రభుత్వం అమోద ముద్ర వేసిన అంశాన్ని వివరించారు. సంబంధిత రోడ్డు నిర్మాణం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇదే క్రమంలో ఇతర రోడ్డు అనుసందానానికి కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించాలని వినతి పత్రం అందచేశారు. నియోజక వర్గ పరిధిలోని పలు సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులను వివరించి వాటి కోసం గాను అవసరమైన నిధులు కేటాయించి ముథోల్ నియోజక వర్గ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి మచేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ముథోల్ ఎమ్మెల్యే పాటిల్ ఇక్కడి విలేకరులకు ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలిపారు.

అలంకార ప్రాయంగా ఆవిరి యంత్రాలు

(5వ పేజీ తరువాయి...)

కూడా గ్యాస్ పొయ్యిలను కూడా వాడక తప్పడం లేదు. ఫలితంగా లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన స్ట్రీమ్ కుక్కర్‌లు నర్సాపూర్, ఉట్నూర్, ఏందా, ఇంద్రవెల్లి, సాలెగూడ, పిట్టబొంగరం, రాయిగూడ, కెస్లాపూర్ ఆశ్రమ పాఠశాలలకు ఒక్కొక్కటి ఐదు లక్షలతో కొనుగోలు చేసిన స్ట్రీమ్ కుక్కర్లు అలంకార ప్రాయంగా మారి తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా స్ట్రీమ్ కుక్కర్లను వాడకంలోకి తేవడానికి వాటికి మరమ్మత్తులుచేపట్టి వంట మనుషులకు శిక్షణలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు.

తాంసి మండలంలో దేశీదారు జోరు



దేశిదారును పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాంసి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేశిదారు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. నిత్యం లక్షల రూపాయల దేశిదారు విక్రయాలు జరుగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని అంటున్నారు. అక్రమ దేశిదారుకు అడ్డు కట్ట వేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేసిన పోలీసులు,ఎక్సైజ్ శాఖ సిబ్బంది అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నరన్న ఆరోపణలు సర్వ త్ర వ్యక్తమవుతున్నాయి. ఇటీవల తాంసి మండలంలోని అట్నం గూడా, లింబు గూడ గ్రామాలలో దేశదారు విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ముఖ్యంగా తాంసి మండలంలోని అట్నాంగూడా, లింబుగూడా, గిరిగావు, పాలోడి, సా వర్గావ్, పద్దాడి, జామిడి తదితర గ్రామాలలో దేశదారును విక్రయిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు మహారాష్ట్ర నుంచి మద్యం కొనుగోలు చేసి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని అంటున్నారు. మహారాష్ట్రలో దేశదారు క్వార్టర్ ధర రూపాయలు 70, అదే దేశదారును తాంసి మండలంలో విక్రయిస్తే క్వార్టర్‌కు రూ. 100 నుంచి 120 రూపాయలు వసూ లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇకనైనా ఎక్సైజ్, పోలీసులు నిఘా పెడితే అసలు విషయం బయటకు వస్తుందని పలువురు అంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన



పొట్టపెల్లిలో ..



డిఫెన్స్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు



తల్వేద ఎక్స్ రోడ్ వద్ద..

నిర్మల్ రూరల్/నర్సాపూర్(జి)/లక్ష్మణచాంద, /ముథోల్/కుంటాల/ఖానాపూర్/కడెం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్ర మాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంచేందుకు జిల్లా పోలీసులు ఆదివారం డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ఇందులో భాగంగా రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులకు, ప్రజలకు నిర్మల్ పోలీసులు తెలియజేస్తూ డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు పాటిస్తూ, ఇతర వాహనదారుల నిర్లక్ష్యం వల్ల సంభవించే ప్రమాదాల నుంచి మనలను మనం ఎలా కాపాడుకోవాలనే జాగ్రత్తల గురించి చాలా స్పష్టంగా తెలియజేశారు. తప్పు దారిలో వచ్చే డ్రైవింగ్ వాహనాలను ముందుగానే గుర్తించాలని, మొబైల్ ఉపయోగించే డ్రైవర్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరిచినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అంతేకాకుండా సిగ్నల్ జంప్ చేసే వాహనాలను గమనించి తగు జాగ్రత్తలు పాటించాలని, ఎవరైనా వాహనదారులు ఆకస్మిక బ్రేకులు వేసినప్పుడు వారికి దూరంగా ఉండేందుకు అవసరమైన దూరం పాటించాలని సూచించారు.ఈఅవగాహన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలను పాటించాలని రూరల్ సీఐ కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని తల్వేద ఎక్స్ రోడ్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులకు ప్రజలకు డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లింబాద్రి పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో ప్రమాదాల నివారణలో భాగంగా నర్సాపూర్ పోలీసులు ఆదివారం సాయంత్రం అర్లీ ఎక్స్ రోడ్డు వద్ద డిఫెన్సివ్ డ్రైవింగ్ (రక్షణ డ్రైవింగ్)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎస్సై గణేష్ నేతృత్వం వహించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు, అప్రమత్తంగా ఉండే విధానాల గురించి ఎస్సై గణేష్ స్థానికులకు వివరించారు. ఇతరుల తప్పుల వల్ల కూడా ప్రమాదం జరగకుండా డ్రైవర్లు ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి తమను తాము కాపాడుకునే నైపుణ్యాలను పెంపొందించడం. ఈ అవగాహన సదస్సులో స్థానిక ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామస్థులు కూడా ఉత్సాహంగా పాటుపంచుకున్నారు. ఈకార్యక్రమ నిర్వహణలో ఎస్సై గణేష్‌కి తోడుగా నర్సాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అయిన ఏఎస్సై శంకర్, కానిస్టేబుల్ ప్రవీణ్, మొయిజ్, మోహన్, స్వామిలు చురుకుగా పాల్గొన్నారు. వారు డ్రైవర్లకు పత్రాలను పంపిణీ చేసి, సందేహాలను నివృత్తి చేశారు. ఎస్సై గణేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. ట్రాక్టర్ డ్రైవర్లు రాత్రి సమయాల్లో లైటింగ్, రిఫ్లెక్టర్లు సరిగా ఉండేలా చూసుకోవాలి. నిర్లక్ష్యం లేని ప్రయాణమే మన కుటుంబానికి, సమాజానికి క్షేమమని పిలుపునిచ్చారు. పోలీసుల ఈ చొరవను స్థానిక ప్రజలు, డ్రైవర్లు అభినందించారు.

కడెంలో రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పటించాలని కడెం ఎస్సై సాయి కిరణ్ సూచించారు. ఆదివారం కడెం మండల కేంద్రంలో వాహనదారులకు, ప్రజలకు డిఫెన్సివ్ డ్రైవింగ్, సేఫ్ డ్రైవ్ ప్రయోజనాలు, సైబర్ నేరాల పట్ల వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, పోలీసులు భీమ్ రావు, వంశీ, విశాల్, అనిల్, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో వాహన చోదకులు (డ్రైవర్లు) రక్షణాత్మక డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్సై జి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పొట్టపెల్లి గ్రామంలో రక్షణాత్మక డ్రైవింగ్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఉల్వాజి హైమావతి రాజు, ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, పోలీస్ కానిస్టేబుళ్లు గణేష్, వినోద్, భీమ్ నాయక్, గ్రామస్థులు ఉన్నారు.

ముథోల్‌లో మండల కేంద్రమైన ముథోల్‌లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక బస్టాండ్ ఏరియాలో ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. రోడ్డుపై డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిసరాలను ముందుగానే గమనిస్తూ డ్రైవింగ్ చేయాలని ఎస్సై సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎదుటివారి తప్పిదాలను తప్పనిసరిగా డ్రైవింగ్ చేసేటప్పుడు గమనించాలన్నారు. దీంతో ప్రమాదాల నుండి రక్షించుకోవచ్చన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రతి ఒక్క డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పద్ధతిని వాహనదారులు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదా లను నివారించవచ్చని సూచించారు. నిర్మల్ పోలీస్ మీపోలీస్ అనిఅన్నారు. ఈ కార్య క్రమంలో పోలీస్‌సిబ్బంది,ఆటోడ్రైవర్లు ఉన్నారు.

కుంటాల వాహన చోదకులు సురక్షితమైన డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని కుంటాల ఏఎస్సై జీవన్ రావు అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్ప వన్నారు. ఈ కార్యక్రమంలో కుంటాల పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్‌లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్, డ్రైవింగ్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... వాహనాల ఫిట్నెస్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలపై, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై జ్యోతిమణి, సిబ్బంది, తదితరులున్నారు.

తల్లిని కోల్పోయి.. బాధ్యత పెరిగింది



బాధిత కుటుంబీకులు

బజార్ హత్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ కుటుంబం వారిది. పెద్ద కూతురుకు పెళ్ళి అత్త వారింటికి పంపించారు. మిగిలిన ముగ్గురు మగ పిల్లలను చదివిస్తేనే కుటుంబం గట్టెక్కుతుందనుకుని లక్ష్యం వైపు సాగుతున్న ఆ కుటుంబానికి ఇటీవల బజార్ హత్నూర్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి మరణం కోలుకోలేని దెబ్బ తీసింది. మండల కేంద్రానికి చెందిన చెవుల రత్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ సంఘటనలో రెండో కొడుకుకు కూడా తీవ్ర గాయాలై మంచం పట్టడంతో కుటుంబానికి దిక్కు తోచని పరిస్థితి ఎదురయ్యింది. తండ్రి,తాత స్వల్ప అనారోగ్యంతో ఉండగా ఇప్పటి వరకు అన్నీ తానై కుటుంబ బాధ్యతలు మోస్తూ పిల్లలను చదివిద్దామనుకుంది ఆ తల్లి. కాని ఆ పిల్లల, భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని తల్లి లేని లోటుతో ఇల్లు బోసిపోయి కనిపిస్తోందని పిల్లలు బోరుమంటూ ఏడ్వడం అందరినీ కలచివేస్తోంది. కాగా ఇద్దరు కవల పిల్లల్లో రాములు హైదరాబాద్ లో డిగ్రీ, లక్ష్మణ్, చిన్న వాడు గణేష్ చదువు స్థానికంగా చదువుకుంటున్నారు. తల్లి ఉంటే అన్నీ తీరుస్తుండేదాని, ప్రస్తుతం ఇంట్లో పనులన్నీ చేయడానికి కష్టంగా ఉందని భర్త చెవుల గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాములు చదువుతో పాటు తండ్రి, తాతల ఆరోగ్యరీత్యా ప్రతీ నెల అయ్యే ఖర్చుల కోసం ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తమ కుటుంబానికి ఆపన్న హస్తం అందించి కాపాడాలని ముక్తకంఠంతో ఆ కుటుంబం, గ్రామస్తులు కోరుతున్నారు.

సీఐఎస్ఎఫ్ జవాన్‌గా నిఖిత

భీంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం పిప్పల్కోటికి చెందిన గడ్డం రవి పార్వతి అనే రైతు దంపతుల కూతురు నిఖితకు సీఐఎస్ఎఫ్ జవాన్‌గా ఉద్యోగం రాగా తమిళనాడులో ఔట్ పెరేడ్ పూర్తి అయ్యింది. కూతురి ఔట్ పెరేడ్‌కు ఆదివారం హాజరయ్యారు. ఆమె తల్లిదండ్రుల ఆనందం వర్ణనాతీతం కాగా ఆమెకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పోస్టింగ్ ఇచ్చారు. ఇదిలా ఉంటే పిప్పల్కోటి గ్రామం నుంచి తొలి మహిళా ఉద్యగం, తొలి మహిళా జవాన్ కూడా నిఖితనే రికార్డుసాధించింది. దీని పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి : టీఏజీఎస్

ఉట్నూర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆరు సంస్థలలో 3431 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను రెగ్యూలర్ ప్రాతిపదికన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని, ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ట్రైకర్ రుణాలు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు,ఐటీడీఏల వద్దతెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్), తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్)ల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవద్దు

ఉట్నూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుంటే అటవి శాఖ అధికారులు అడ్డుకోవడం సరైనది కాదంటూ కోలాం గిరిజనులు సోమవారం ఐటీడీఏ ముందు నిర్వహించనున్న ర్యాలీ ధర్నా విజయవంతం చేయాలని కోలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు కోరారు. ఆదివారం ఐటీడీఏ ముందు ధర్నా స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఇప్పటికే ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించడానికి పోలీసుల అనుమతి తీసుకున్నామని సోనేరావు వివరించారు.ఉమ్మడి జిల్లాలోనికోలాం గిరిజనులందరు సోమవారం చెక్‌పోస్టు కొత్తగూడెం వద్ద గుమిగూడి అక్కడి నుంచి పాదయాత్ర ద్వారా ఐటడీఏకు చరుకుని ధర్నా నిర్వహిస్తామన్నారు.ఆయన వెంటకుమురరాజు, భీమ్రావు తదితరులున్నారు.

కొనసాగుతున్న రబీ సాగు పనులు

బజార్‌హత్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల సాగు చురుగ్గా సాగుతోంది. ఖరీఫ్‌లో పత్తి, సోయా పంటల్లో రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆ నష్టాన్ని రబీలోనైనా పూడ్చాలని రైతులు రబీపంటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణంతో పాటు సాగునీటి లభ్యత ఉండటంతో రైతుల ఆశలు సజీవంగా నిలిచాయి. ఈ వారంలో ఈ ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. కాగా మండలంలో మొక్క జొన్న, జొన్న, శనగ, కొత్తిమీర రబీ పంటలు సాగవు తున్నాయి.ఒకసారికే ఏరినపత్తిని తీసేసి ఆస్థానంలోరబీ పంటలుసాగు చేస్తున్నారు.సంబంధిత అధికారులు బజార్ హత్నూర్ చెరువు కుడి, ఎడమ కాలువల్లో పేరుకపోయిన చెట్ల పొద లు, గడ్డి, చెత్తను తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలాచూడాలని రైతులు కోరుతున్నారు.

స్మారక సభను జయప్రదం చేయాలి

ఖానాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే చంద్ర పుల్లారెడ్డి స్మారక సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో ఆదివారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో స్మారక సభ పోస్టర్లను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న భారత విప్లవ ఉద్య మ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి 41వ స్మారక సభను ఖానాపూర్ డివిజన్ నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్య క్రమంలో నాయకులు దుర్గంలింగన్న, గోట్లప్రసాద్, స్వామి, శ్రీనివాస్, రాములు,రాధ, ఉన్నారు.

అవినీతి అధికారులపై కొరడా

బోథ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లాలో అవినీతి అధికారుల పై కొరడా ఝులిపించేందుకు ఏసీబీ అధికారులు సమయత్తమవుతున్నారు. పై స్థాయిలో ఉన్నత అధికారులు మండలాల వారీగా అవినీతి రారాజుల అక్రమాల చిట్టాలు తెప్పించుకుని పారిపోయిన దాడులు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అందులో భాగంగానే జిల్లాలో పలు సబ్ రిజిస్టర్ కార్యాలయాల పైన దాడులు చేస్తున్నారని తెలిసింది. అయితే ప్రతి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు జరుగుతున్న అవినీతి లావాదేవీల పైన పూర్తి స్థాయి నివేదికలను ఏసీబీలోని పై స్థాయి అధికారులు తెప్పించుకున్నట్లు సమాచారం వారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏసీబీఅధికారులు దాడులకు పాల్పడుతున్నారని అంటున్నారు.జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ట్రెజరీ శాఖల పై రిపోర్టులు తెప్పించుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా మారుమూల మండలాల్లో ఉన్న అవినీతి అధికారుల పైన ఏసీబీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతోపై స్థాయిలో ఉన్న అధికారులు ప్రజల నుంచి వెళ్లిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొనిదాడులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కేస్లాపూర్ నాగోబా ఆలయ, గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా ఆల యంతో పాటు కేస్లాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని మెస్రంవంశీయులు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు నరేందర్‌రెడ్డికి విన్నవిం చారు. ఆదివారం మాజీ ఎంపీ సోయం బాపూ రావుతో కలిసి హైదరాబాద్‌కు ప్రభుత్వ ముఖ్య సలహాదారులు నరేందర్‌రెడ్డి నివాసానికి సందర్శించి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, బాదిరావు పటేల్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, మెస్రం వంశీ యులు నాగనాథ్, భారీక్‌రావు,తదితరులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠాపన



అమ్మవారిని మొక్కుతున్న ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శ్రీ ముత్యాలమ్మ, పెద్ద పోచమ్మ విగ్రహాల పునః ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.అమ్మవార్లకు ప్రత్యేక పూజలుచేశా రు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తక్కల రమణారెడ్డి, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు నర్సారెడ్డితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు (సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ ఆదర్శనగర్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయుటకు నిర్మిస్తున్నటువంటి 33 కేవీ టవర్ లైన్ పనుల దృష్ట్యా ఆదర్శనగర్, జీఎన్ఆర్ కాలనీ, ఈద్‌గాం, గాయత్రిపురం, సిద్దాపూర్, రాంనగర్, విజయనగర్ కాలనీ, భాగ్యనగర్, సోఫీనగర్, డీ మార్ట్, సాగర్ కన్వెన్షన్ హాల్, మహమ్మదీయ మజీద్ ఏరియాలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

మా పంటలు కోసే వరకు నీరు నిల్వ ఉంచొద్దు

- సదర్మాట్ మినీ బ్యారేజీ రైతుల ఆవేదన

మామడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అహర్నిశలు కష్టపడి పండించిన వరి పంట చేతికి వచ్చే సమయంలో సదర్మాట్ మినీ బ్యారేజీ గేట్లు మూసి వేయడంతో పంట పొలాల్లోకి నీరు చేరి వరి కోతలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. ఆదివారం రైతులు డ్యామ్ వద్దకు చేరుకుని 5 రోజుల్లో వరి కోయడం పూర్తి అవుతుందని, అంతవరకు గేట్లను మూయవద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంటను సాగు చేశామని, నీటిని నిల్వ చేయడం వల్ల వరి కో యడానికి అనేక అవస్థలు పడుతున్నామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి రైతులు తీసుకువెళ్లగా, వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడి గేట్లను ఓపెన్ చేయాలని సూచించారు. రైతులు పూర్తిగా వరిని కోసిన తర్వాతనే గేట్లను మూసి వేయాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



చెక్కులను అందచేస్తున్న ముథోల్ విఠల్ రెడ్డి

భైంసా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం బాసటగా నిలుస్తోందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయపు చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యపు సమస్యలతో బిల్లులు చెల్లించి వైద్య సేవల పొందిన బాధిత కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సాయం కోసం గాను తమను సంప్రదించాలని సూచించారు. ఇందులో తానూర్ మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫారుఖ్ అహ్మద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

భీమన్న గుట్టను కాపాడాలని ఎంపీకి వినతి



ఈటెలకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో అన్యాక్రాంత అవుతున్న భీమన్న గుట్టను కాపాడాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఎంపీ ఈటెల రాజేందర్‌ను కలిసి ఎన్నో ఏళ్లగా భీమన్న గుట్టపై పండ్ల చెట్ల పెంపకం చేస్తూ జీవనోపాధి గడుపుతున్నామని, భీమన్న గుట్ట వద్ద ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం అయిన ముదిరాజ్‌లు కొలిచే భీమన్న దేవుడి గుడి ఉందని, ముదిరాజ్‌ల సెంటిమెంట్‌కు సంబంధించిన విషయం కాబట్టి భీమన్న గుట్ట ఆక్రమణకు గురవుతోందని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ముదిరాజ్ జిల్లా కోఆర్ కమిటీ సభ్యులు వాపోయారు. ఈ విషయమై ఈటెల రాజేందర్‌కి వినతి పత్రం సమర్పిస్తూ న్యాయం చేయవలసిందిగా అర్థించారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ, సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ కోర్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



ఐటీడీఏ పీఓ సన్మానం చేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

ఉట్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సుముఖత వ్యక్తం చేశారని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐటీడీఏ పీఓ యువరాజ్ మరమటను కలిసి ఉపాధ్యాయ సంఘం డైరీని అందించి సన్మానం చేసిన సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎస్‌టీయూ కలిసినట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ రవికుమార్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జాదవ్‌అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర నాయకులు శీతల్‌చౌహాన్, దిలేష్‌చౌహాన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భానోత్‌ఆత్మారాం, అధ్యక్షులు రాథోడ్‌దినేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఎన్నికలు

తాంసి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెల్లూరి అయ్యప్ప ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ ఓటింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గంకు నిర్వహించే ఈ ఎన్నికల్లో పలువురు అభ్యర్థులు పోటీలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప స్వామి భక్తులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అందుకోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రభుత్వాలు నిర్వహించే ఎన్నికలను తరిపించే విధంగా జరగడం విశేషంగా చెప్పవచ్చు. ఫలితాలు సోమవారం ప్రకటించనున్నారు. మొత్తం మీద ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

స్వేచ్ఛకు సంకెళ్లు కవిత సంపుటి ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం కవి పోలీస్ భీమేష్ తెలంగాణ యాసలో రచించిన స్వేచ్ఛకు సంకెళ్లు కవిత సంపుటిని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు సామాజిక అంశాలపై తెలంగాణ యాసలో రాసినందుకు భీమేష్‌ను అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు వేతన వెతలు



చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికుడు

తాంసి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యం తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి పని చేస్తున్న పారిశుద్ధ కార్మికుల పనితీరు అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. మండలంలో పొన్నారి, తాంసి తోపాటు పలు గ్రామాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నిత్యం తమ ప్రాణాలను ప్రాణం గా పెట్టి పారి శుద్ధ కార్మికులు ప ని చేస్తున్నారు. అన్ని వాసనలకు ఓర్చుకొని తమ ప నులు తాము చేస్తున్నారు. కాని ప్రభుత్వం మాత్రం నెల నెలా వేతనం చెల్లించడం లేదు. దీంతో తమ కుటుంబం గరుడం కష్టమవుతుందని అంటున్నారు. 18 నుంచి 20 రోజులు పని చేస్తున్న అధికారులకు ప్రతినెల వేతనాలు చెల్లిస్తున్న ప్రభు త్వం నిత్యం పనిచేస్తున్న కార్మికులకు ఎందుకు వేతనాలు చెల్లిం చడం లేదన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. మురికి కాలువలు తీయడమే కాకుండా రోడ్లపై ఏ రాణి చనిపోయిన, రోడ్లను ఊడుస్తూ పారిశుద్ధ కార్మికులు దానిని తొలగిస్తున్నారు. మొత్తం మీద పారిశుద్ధ కార్మికులు చేస్తున్న పను లను పలువురు ప్రశంసిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి వారికి ప్రతి నెల వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

డ్రగ్స్ ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలవుతున్న విద్యార్థులు

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పుట్టి ఎరిగి ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్లిన విద్యార్థులు రంగుల ప్రపంచంలో ఏది మంచి చెడు అనేది తెలియక ముందే అనుకోకుండానే ఆన్‌లైన్ గేమింగ్‌కు బలి కావడంతో పాటు డ్రగ్స్‌కు అలవాటు పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

తల్లిదండ్రుల అమాయకత్వం ఆసరాగా

గ్రామాలలో ఉంటూ వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఉద్యోగాలు సంపాదిస్తారని ఊహించి కలలు కంటున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చకుండానే విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారిపోతున్నారు.

తల్లిదండ్రులకు తెలియకుండానే అప్పుల పాలై

ఉన్నత చదువుల కోసం వెళ్లిన యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పడి అప్పులల పాలవుతున్నారు. చివరికి పట్టణం విడిచి పల్లెలకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో గెలుపొందిన వారు డబ్బుల కోసం వేధిస్తుండడంతో చేసేది లేక ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతున్నంది. కొంత మంది పిల్లల తల్లిదండ్రులు పిల్లలు చేసిన అప్పులు తీర్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అప్పు చేసింది దేని కోసం అనేది అమాయకులైనా తల్లిదండ్రులకు తెలియక కొడుకు ప్రాణం బతికి ఉంటే చాలు అప్పును ఎలాగైనా తీర్చుదామంటు ఆస్థులు అమ్ముకుని బకాయిలు కడుతున్నారు. ఇది ఏమైనా ఉన్నత చదువుల కోసం వెళ్లి అప్పులపాలై తిరిగి వస్తున్న పిల్లలను చూసిన తల్లిదండ్రులు ఓవైపు ఆందోళన మరోవైపు ఆవేదన చెందుతున్నారు.

డ్రగ్స్‌కు బానిసలు ఎందరో

మండలంలో వివిధ గ్రామాల నుంచి ఉన్నత చదువుల కోసం వెళ్లిన యువకులు డ్రగ్స్ బానిసలుగా మారుతున్నారు. ఫలితంగా ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రంలో దాదాపు పది మంది వరకు ఉన్నత కుటుంబాల వారి పిల్లలు డ్రగ్స్‌కు బానిసలుగా మారారని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రానికి చెందిన ఇరువురు వ్యాపారుల పిల్లలతో పాటు పేరున్న కుటుంబాల పిల్లలు డ్రగ్స్‌కు బానిసలుగా మారారు. ప్రతిరోజు సాయంత్రం పూట ఊరి బయట గంజాయి పీల్చేందుకు తరలిపోతుంటారు. రాత్రి పదిన్నర గంటల వరకు 12గంటల వరకు పట్టణంలోని కొన్ని ప్రత్యేకమైన స్థలాల్లో గంజాయి తాగుతున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఓ కల్లు కాంపౌండ్ సమీపంలో గంజాయి పాకెట్లతో వచ్చిన వ్యక్తి కుట్టు చప్పుడు కాకుండా విక్రయించి వెళ్తున్నాడని పలువురు పేర్కొంటున్నారు. గంజాయి ముఠాల పై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బోథ్ అడవులలో పెద్దపులితో పాటు

చిరుతల సంచారం

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోథ్ అడవులలో మాంసాహార జంతువులైన చిరుత పులి పెద్దపులిలకు కావాల్సినంత ఆహారం లభించడంతో ఈ అడవుల్లో తిష్టవేశాయి. దీంతో ప్రతిరోజు మారుమూల గ్రామాలలోని అడవులలో చిరుతల దాడి పెద్దపులి దాడి జరుగుతూనే ఉంటుంది. గత ఆరు రోజుల క్రితం చిరుత పులి నిగిని అడవులలో దాడి చేసి లేక దూడను చంపివేసింది. అయితే ఈ సంఘటనను మరిచిపోక ముందే సోనాల మండలంలోని బోథ్ అడవుల పరిధిలో చింతలబోరి అటవీ సమీపంలో అడవి పందిపై పెద్ద పులి దాడి చేసి చంపివేసినట్లు సమీప గ్రామాల ప్రజల ద్వారా తెలిసింది. ఈ విషయాన్ని అటవి శాఖ అధికారులు సైతం పరిశీలించారు.



అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి

రెండు పులులకు ఉపవాసం...

బోథ్ అడవులలో రెండు పెద్ద పులులు సంచరిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు మాత్రం బయటకు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. అయితే అటవి సమీప గిరిజన గ్రామాల ప్రజలు మాత్రం రెండు పులులు సంచరిస్తున్నాయని అంటున్నారు. ఆడ పుల్లి పెద్దగా ఉందని అది గర్భంతో ఉన్నట్లు కనిపిస్తుందని అంటున్నారు. మగ పులి సైతం అక్కడక్కడ దాడులకు పాల్పడుతున్నదని ప్రజలు పేర్కొంటున్నారు. మగ పెద్దపులి ఆహారాన్ని సేకరించి గర్భం దాల్చిన ఆడపులికి అందించడం జరుగుతుందని అంటున్నారు. అయితే ఆడ పులి మాత్రం గర్భం దాల్చిన సమయంలో వేటాడదని అటవి శాఖ అధికారులు అంటున్నారు.

పులుల రక్షణ పై ప్రత్యేక దృష్టి...

అటవి శాఖ అధికారులు పులి రక్షణపైన ప్రత్యేక దృష్టిని సారించారు. అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం జరిగింది. పాద ముద్రలను గుర్తించేందుకు ప్రత్యేక నిపుణులు సైతం వస్తున్నారు. పులి ఎటు వైపు వెళ్లింది ఎక్కడ ఉంది అని సమాచారాన్ని వెంట వెంట చేరవేస్తున్నారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కెమెరాలలో పులి కనిపించిందని తెలుస్తుంది. ఏది ఏమైనాచిరుతల పులుల ఆవాసానికి బోథ్ అడవులు నిలయంగా మారుతున్నాయి.

పిల్లలు కనేంత వరకు ఇక్కడే...

ఆడపులికి పిల్లలు పుట్టేంత వరకు మగపులి ఈ ప్రాంతంలోనే ఉంటుందని ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవడం సహాజమని అటవి శాఖ వర్గాల వారు అంటున్నారు. ఆడపులి మగ పులిని విడిచి సుదూరంగా వెళ్లి పిల్లలను కంటుందని అంటున్నారు. ఎందుకంటే మగపులి ఆడ పులి దగ్గర ఉంటే పుట్టిన పిల్లలను తినే అస్కారం ఉన్నందున ముందు జాగ్రత్తగా తన పిల్లల సంరక్షణ కోసం ఆడ పులి సుదూరంగా వెళ్లిపోతుందని అంటున్నారు.

నేటి నుంచి జిన్నింగ్ మిల్లు యాజమాన్యాల సమ్మె బాట



భైంసాలోని జిన్నింగ్ మిల్లు

- నిలిచిపోనున్న పత్తి కొనుగోళ్లు
- రైతాంగానికి మరిన్ని తిప్పలు

భైంసా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సంబంధించి విధించిన నిబంధనలను తొలగించాలని, తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ జిన్నింగ్ మిల్లుల యజమానులు సోమవారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టనున్నారు. మిల్లులను మూసివేసి పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. ప్రతికూల పరిస్థితులతో అష్టకష్టాలు పడుతున్న రైతాంగం జిన్నింగ్ మిల్లుల యజమానుల సమ్మెతో మరింత ఇబ్బందులను ఎదుర్కొనుంది.

● జిన్నింగ్ మిల్లులన్నింటిలోనూ కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్

సీసీఐ కొనుగోళ్లకు సంబంధించి జిన్నింగ్ ఫ్యాక్టరీల ఎంపిక,నిర్వాహణ ప్రక్రియలో విధించిన ఎల్-1,ఎల్-2,ఎల్-3 నిబంధనను తొలగించాలనే ప్రధాన డిమాండ్‌తో జిన్నింగ్ మిల్లుల యజమానుల సంఘం సమ్మె బాట పట్టింది. ఎల్ 1,2,3 నిబంధనతో కొన్ని జిన్నింగ్ మిల్లులకు ప్రయోజనం చేకూరగా మిగతా జిన్నింగ్ మిల్లులకు కొనుగోలు కేంద్రాల ఎంపిక ప్రక్రియలో అన్యాయం జరుగనుందనే పలు మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. సంబంధిత నిబంధన ద్వారా ఇదే క్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహణలో విధించిన ఇతర నిబంధనల్లో సైతం మార్పులు చేపట్టాలని మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.అంతేకాకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతాంగం పత్తిని విక్రయించేందుకు గాను అమలులోకి తీసుకవచ్చిన కిసాన్ కపాస్ యాప్‌ను సైతం ఎత్తివేయాలని మిల్లుల యజమాన్యం పేర్కొంటోంది. దీనికి తోడు ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి ఇది వరకటి లాగే 12 క్వింటాళ్ల మేర పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

● జిల్లాలో 9 జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోళ్లు

ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు సీసీఐ 9 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టింది. ఇందులో భైంసాలో 6 జిన్నింగ్ మిల్లులు ఉండగా సారంగాపూర్, నిర్మల్, కుభీర్‌లో ఒక్కోజిన్నింగ్ మిల్లులో కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్ల నిర్వహిస్తోంది. సీసీఐ భైంసాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా శనివారం వరకు 2,566 మందికి రైతులకు సంబంధించిన 40,888 క్వింటాళ్ల మేర పత్తి కొనుగోళ్లు చేపట్టింది.ఇక ఇక్కడి మార్కెట్ పరిధిలో ప్రైవేట్ వ్యాపారులు 457 మంది రైతుల వద్ద నుంచి 3,955 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.



భైంసాలోని జిన్నింగ్ గేట్‌కు ఏర్పాటు చేసిన నిరవధిక సమ్మెఫ్లెక్సీ

● పరేషాన్‌లో పత్తి రైతు

ప్రతికూల పరిస్థితులతో పడరాని పాట్లు పడుతున్న పత్తి రైతులు జిన్నింగ్ మిల్లుల యజమానుల సమ్మెతో అగచాట్ల బారిన పడనున్నారు. పత్తి దిగుబడులను విక్రయించుకొని వచ్చిన డబ్బులతో యాసంగి పంటల సాగుకు సిద్దమవుదామనుకున్న రైతాంగం పెట్టుకున్న ఆశలకు గండిపడే పరిస్థితులు నెలకొన్నాయి. సమ్మెతో పత్తి కొనుగోళ్ల నిలిచిపోతున్న నేపథ్యంలో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి



జిన్నింగ్ యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి.ప్రతికూల పరిస్థితులతో కష్ట,నష్టాలతో బేజారవుతున్న రైతాంగం పత్తి కొనుగోళ్ల నిలిచిపోవడంతో మరింతగా ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. రైతాంగం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సమ్మె పరిష్కారానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే చర్యలు చేపట్టాలి. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సైతం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి.

- డా.కిరణ్ కోమ్రేవార్, బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ప్రతినిధి, ముథోల్ నియోజక వర్గం

లోక్ అదాలత్‌కు భారీ స్పందన

3538 కేసులు పరిష్కరమైనట్లు ఎస్పీ వెల్లడి

ఆదిలాబాద్‌టౌన్,నవంబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్ట్ ప్రాంగణంలో శనివారం నిర్వ హించిన ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించిందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈమేరకు విడుదల చేసిన ప్రక టనలో లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. రాజీమర్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 3538 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఇందులో 300 ఐపీసీకేసులు పరిష్కరించగా, 577 ఈపెటి కే సులు, 2661 డ్రంక్అండ్ డ్రైవ్ కేసులు ఉన్న ట్లు వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 26,61,000 జరిమానా విధించినట్లు తెలిపారు. వీటికి అదనంగా జిల్లా వ్యాప్తంగా నమోదైన 57 సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న రూ.10,50,880 సంబంధించిన ఉత్తర్వులు వచ్చాయని, అందులో రూ.1,25,853 తిరిగి వారి అకౌంట్లో జమ అయినట్లు తెలి పారు. ఎఫ్ఐఆర్ కేసుల్లో ఈ పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎక్సైజ్ కేసులతో పాటు నేర నిరూపణ ఉన్న నిందితులు స్వయంగా న్యాయ స్థానాలకు హాజరై తప్పులను ఒప్పుకోవడంతో కేసులను పరిష్కరించినట్లు వివరించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కొట్లాట, భార్యాభర్తల మధ్య వివాదాలు, అత్తింటి వారి వేధింపులు, అన్ని రకాల క్రిమినల్ కేసుల్లో నిందితులు, బాధితులు కలిసి హాజరై రాజీమార్గంలో రాజీ పడటంతో కేసులను కొట్టివేసినట్లు వెల్లడించారు. కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తూ విధుల ను నిర్వర్తించిన కోర్టు డ్యూటీ అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభి నందించారు. జిల్లా పోలీసు వ్యవస్థతో వివిధ సమావేశాలు ఏర్పాటు చేస్తూ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభా కర్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పో లీస్‌శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైస్ మిల్లర్ చేతివాటం

రూ.3 కోట్ల 50 లక్షల విలువగల పీడీఎఫ్ రైస్ మాయం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలో మారో కుంభోకోణం వెలుగు చూసింది. దాదాపు రూ.3 కోట్ల 50 లక్షల రేషన్ బియ్యం మాయమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్ బైపాస్ వద్ద గల నైతిక్ రైస్ మిల్‌పై ఆదిలాబాద్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సుధారాణి శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేయడం జరిగిందని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రూరల్ మండలంలోని నైతిక రైస్ మిల్‌కు దాదాపు 1500 మెట్రిక్ టన్నుల వడ్లను ధాన్యాన్ని సివిల్ సప్లై ఆదిలాబాద్ జిల్లా అధికారులు రేషన్ బియ్యం కోసం కేటాయించగా 1200 మెట్రి కన్నుల వడ్ల మాయమైనట్లు సివిల్ సప్లై అధికారులు గుర్తించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి విచారణ జరిపి నైతిక్ రైస్ మిల్ యజమాని వినోద్ కుమార్ ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

హలో రైతన్న చలో భోరజ్ కరపత్రాల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 21న హలో రైతన్న చలో భోరజ్ నినాదంతో నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆదివారం రైతు నాయకులు, వివిధ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం నిరసనగా ఎన్‌హెచ్ 44 హైవే రోడ్డుపై రియలన్స్ పెట్రోల్ బంక్ భోరజ్ వద్ద రాస్తారోకో, రోడ్డు దిగ్బంధం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ, రైతు స్వరాజ్య వేదిక రైతు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల మద్ధతు, ఆదిలాబాద్ నియోజకవర్గ రైతుల సోదరుల మద్దతుతో రైతు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీమాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్, చందాల రాజన్న,పీఏసీఎస్ ఛైర్మన్ కుందన్ కిరణ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కనకరమణ, అత్రం వెంకటి,గౌరురమేష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ గ్రామానికి చెందిన అగ్గిమల్లు శ్రీలేఖ(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వివరాలు ప్రకారం.. అగ్గిమల్లు శ్రీలేఖ పది సంవత్సరాల క్రితం గంగాధర్‌తో వివాహమై సంవత్సరం క్రితం విడాకులు అయ్యాయి. పిల్లలు ఎవరు లేరని, ఆమెకు మూర్ఛ వ్యాధి కూడా ఉందని, కొన్ని రోజులుగా ఆమె మానసిక పరిస్థితి బాగా లేక పోవడంతో శనివారం గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. ఆదివారం మృతురాలి అన్న కడిదారపు పోచన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసుల బృందం

తాంసి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నడిపే వాహనానికి నెంబర్ ప్లేట్ లేకున్నా, బండిపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాకున్న, సరి యైన పత్రాలు లేకపోయినా పోలీసులు ఫైన్ వేస్తున్నారు.జిల్లా ఎస్పీ అఖిలేష్ మహాజన్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరంగా చేస్తున్నారు. వాహనాల తనిఖీలు భాగంగా ఆదివారం మండలంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున వాహనాలు తనిఖీ చేసి పరిశీలించారు. వాహనాలు నడిపే వారు లైసెన్సులు లేకున్నా, హెల్మెట్ల ధరించకున్నా వారిపైఫైన్ విధి స్తున్నారు. ఉదయం నుంచి ఈకార్యక్రమాలు ప్రారం భించడంతో వాహ న చోదకులో భయం దోళనలు మొదలవు తున్నా యి.తాంసి మండల కేంద్రంలో శని వారం ఈ తనిఖీ కార్యక్రమాన్ని ముమ్మారంగా చేపట్టారు. కొంతమంది వాహనాలు నడుపుతూ దొడ్డి దారిన పారిపోయేలా చూసినప్పటికీ పోలీసులు పట్టు కున్నారు. వారి నుంచి వాహనాలకు సంబంధించిన పత్రాలు లేక పోవడంతో వాహ నాలనుస్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈకార్య క్రమంలో హెడ్ కాని స్టేబుల్ రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై లింబాద్రి

నిర్మల్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన నిందితుడు షేక్ సద్దాంని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తి, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కృష్ణ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనివారం రాత్రి వైఎస్ఆర్ కాలనీకి చెందిన సయ్యద్ సమీర్ అనే యువకుడిని అదే కాలనీకి చెందిన షేక్ సద్దాం వెనుక వైపు నుంచి వీపులో కత్తితో పొడిచాడు. బాధితుడు నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితుడు ఆదివారం తన ఇంటిలో ఉన్నాడని సమా చారంతో రూరల్ ఎస్సై లింబాద్రి, సిబ్బంది వెళ్లి నిందితుడిని పట్టుకుని కోర్టు ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్సై లింబాద్రి, సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

బోథ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):సోనాల మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల కాంట్రాక్టర్ అయిన సత్యనారాయణ గత వారం రోజుల క్రితం పోలీసులకు చిక్కి ఆ తర్వాత పోలీసు స్టేషన్ నుంచి పరారీ కావడం జరిగింది. దీంతో పరారైన రిమాండ్ ఖైదీ కోసం పోలీసులు వెతికి పట్టుకోవడం జరిగింది. అయితే రిమాండ్ ఖైదీ పోలీసు స్టేషన్ నుంచి తప్పించుకున్న సమయంలో స్టేషన్‌లో ఆయనపై నిఘా ఉంచాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న సమాచారంతో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ముగ్గురు కానిస్టేబుల్ గత మూడు రోజుల క్రితమే సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పరారీ అయిన నిందితునితో కలిసి భోజనం చేసిన పోలీస్ ఉద్యోగి పూర్తిగా నమ్మి ఉండడంతో అవకాశం చూసి రిమాండ్ ఖైదీ పరారీ అయినట్లు తెలిసింది. జరిగిన తతంగమంతా జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

భీంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భీంపూర్‌కి చెందిన ఏర్మ అంకుష్ (42) ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. తరువాత రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు. కాగా ట్రాక్టర్‌ల ఫైనాన్స్ కిస్తులు కట్ట లేక మనోవేదనకు గురైన అంకుష్ ఆత్మ హత్య చేసుకున్నట్లు బీంపూర్ పోలీసులు తెలిపారు. తల్లి రత్నామాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీనివాస్ మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలుపలికి తీసుకు వస్తున్న దృశ్యం, మృతుడి శ్రీనివాస్ (ఫైల్)

బాసర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాసర మండలం టాక్లి గ్రామానికి చెందిన స్వరూప(58) అనే మహిళ గ్రామ సమిపాన గల వాగులో దూకి ఆత్మహత్య చేసుకోగా అతని కుమారుడు శ్రీనివాస్(29) తల్లిని రక్షించేందుకు వాగులో దిగి ప్రాణాలు వదిలిన విషయం తెలిసిందే. శనవారం ఘటజన జరిగన రోజే స్వరూప మృతదేహం లభించగా శ్రీనివాస్ ఆచూకి లభించలేదు. వాగులో ఎంత వెతికినా జాడ కనబడలేదు. ఆదివారం శ్రీనివాస్ మృతదేహం నీటిపై తేలడంతో ఆయన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఇంట్లో ఆర్థిక పరమైన సమస్యలు , కుటుంబ కలహాల వల్ల స్వరూప ఆత్మహత్య చేసుకోగా ఆమెను రక్షించబోయి శ్రీనివాస్ కూమా మృతి చెందాడు. ఈ ఘటనపై బాసర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉండే మౌనిక(24) అనే యువతి ఆదివారం ఉదయం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కే. నాగరాజు తెలిపారు. గత కొన్నాళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. ఉదయం పనికి వెళ్లిన తల్లి సాయంత్రం మూడు గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఆమె ఉరేసుకొని ఉండటాన్ని గమనించిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూదగాళ్లపై కేసు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుమార్ పెట్‌లో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపారు. జూదగాళ్ల వద్ద నుంచి రూ.840 నగదు, నాలుగు చరవాణులు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు.

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5, కనిష్ఠం 10.4

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

సోమవారం 17 నవంబరు 2025

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం

అలంకార ప్రాయంగా ఆవిరి యంత్రాలు

▸▸ 54 పాఠశాలల్లో 19వేల మంది విద్యార్థులు ▸▸ వంట మనుషులకు శిక్షణ కరువు


ఉట్నూర్, నవంబర్16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం సకాలంలో అందించడానికి అధికారులు మంజూరు చేసిన ఆవిరి యంత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ఆవిరి యంత్రాలు (స్టీమ్ కుక్కర్లు) ఏర్పాటు చేయడం ఎంతో బాగున్న, ఆచరణలో అమలు చేయడంలో సిబ్బంది విఫలమయ్యారని తెలుస్తుంది. ఫలితంగా లక్షలాది రూపాయల ధనం వృధా అయినట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. పర్యావరణ రక్షనతో పాటు గ్యాస్ ఆదాయ ఖర్చులను తగ్గించాలని భావించిన గిరిజన సంక్షేమ వాఖ అధికారుల ఆలోచనతో జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు స్టీమ్ కుక్కర్‌లను దశాబ్ద కాలం కింద పంపిణీ చేశారు. 90శాతం ఆశ్రమ పాఠశాలలో ఈ స్టీమ్ కుక్కర్‌లు పని చేయక మూలకు పడవేసేయడంతో తుప్పు పడుతున్నాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత అధికారుల ఆలోచన మేరకు కొనుగోలు చేసిన స్టీమ్ కుక్కర్లను (ఆవిరి యంత్రాలు) ఆశ్రమ పాఠశాలలకు పంపించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన ఆహారం అందించడానికి కట్టెల పొయ్యిలు వాడుతుండడంతో అడవులు అంతరించి పోయి పర్యావరణకు ముప్పు కలుగుతుందని అధికారులుభావించారు. ఆశయం బాగానే ఉన్న అక్కడక్కడ ఇంకా ఆశ్రమ పాఠశాలల్లో కొన్ని చోట్ల కట్టెల పొయ్యిలే వాడుతున్నారు. గ్యాస్ ఖర్చులను ఆదా చేయడానికి కొందరు వార్డెన్లు కట్టెల పొయ్యిలు వాడక తప్పడం లేదని, గ్యాస్ పొయ్యిపైన అన్నం సరిగా ఉడకడం లేదని పేర్కొంటున్నారు.



పని చేయని బాయిలర్



ఇడ్లీ ఆవిరి యంత్రం



పనిచేయని ఆవిరి వంట పాత్రలు

వంట మనుషులకు శిక్షణ కరువు...

ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వంట మనుషులకు ఆవిరి యంత్రాల వాడకం పై అధికారులు శిక్షణ ఇవ్వక పోవడంతో వంట మనుషులు కూడా స్టీమ్ కుక్కర్లను వాడడానికి భయపడుతున్నారు. గత ఐదేళ్ల క్రితం ఉట్నూర్ మండల ఏంద్రంలోని క్రీడా పాఠశాలలో స్టీమ్ కుక్కర్ పేలి పోవడంతో వంట మనిషి స్వల్ప ప్రమాదంతో బయట పడ్డారు. ఈ సంఘటన తెలిశాక ఆయా పాఠశాలలో పని చేస్తున్న వంట మనుషులు సైతం స్టీమ్ కుక్కర్లను ముట్టడం లేదు. అడవులను కాపాడడానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం కట్టెలు (వంట చెరుకు) వాడకుండా నిరోదించడానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వాలు సబ్సిడీ పై గ్యాస్ సిలీండర్లు పంపిణీ ఏసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ పాఠశాలల్లో కూడా వంట చెరుకు వాడకాన్ని తగ్గించాలని గ్యాస్ పొయ్యిలతో పాటు సిలీండర్లు, స్టీమ్ కుక్కర్లు పంపిణీ చేశారు. అయినప్పటికి ఆశ్రమ పాఠశాలలో మాత్రం స్టీమ్ కుక్కర్లను పక్కనపెట్టి కట్టెల పొయ్యిలను వాడుతూ

(తరువాయి 6వ పేజీలో....)

కుక్‌లకు శిక్షణ ఇవ్వాలి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛమైన రుచికరమైన భోజనం అందించడానికి గిరిజన సంక్షేమ అధికారులు స్టీమ్‌కూకర్లు ఏర్పాటు చేయడం బాగుంది. కాని ఆశ్రమ పాఠశాలల్లో వంటలు చేస్తున్న సిబ్బందికి శిక్షణలు ఇస్తే బాగుండేది. 54 ఆశ్రమ పాఠశాలలు ఉండగా కేవలం నాలుగు పాఠశాలల కూక్‌లకు మాత్రమే శిక్షణ ఇచ్చారు. ఇప్పటికైనా ఆవిరి యంత్రాలకు మరమ్మతులు చేపట్టి కుక్‌లకు అవసరమైన శిక్షణ ఇచ్చి వినియోగంలోకి తెస్తే బాగుంటుంది.

- అక్బర్, రిటైర్డ్‌కుక్, గిరిజన సంక్షేమ శాఖ

మరమ్మతులు చేయిస్తాం



విద్యార్థులకు సక్రమంగా వెను వెంటనే వేడి భోజనం అందించడానికి ఏర్పాటు చేసిన ఆవిరి యంత్రాలకు మరమ్మతులు చేయిస్తాము. ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక చోట పని చేస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొన్ని చోట్ల పని చేయడం లేదు. అవసరం అయిన వారికి మరోసారి శిక్షణ ఇస్తాం.

- జాదవ్ అంబాజీ, డీడీ ఐటీడీఏ ఉట్నూర్



ఎంపీ, ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛంతో సన్మానిస్తున్న దృశ్యం

తరోడ బ్రిడ్జి వద్ద తొలగనున్న రాకపోకల ఇబ్బందులు

▸▸ రూ.12కోట్లతో నిర్మించే వంతెన నిర్మాణానికి భూమిపూజ

జైనథ్, నవంబర్16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలు గత కొన్నేళ్లుగా తరోడ వంతెన వద్ద పడుతున్న రాకపోకల ఇబ్బందులు ఎట్టకేలకు తొలగనున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న నూతన బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎంపీ గోడంనగేష్‌తో కలిసి ఎమ్మెల్యే పాయలశంకర్ 12 కోట్లతో నిర్మించే తరోడ బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరోడ పాత వంతెన బీటలు వారి కూలిపోయేగా అదే స్థానంలో పూర్తి కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.12 కోట్లతో నూతన వంతెన నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇన్ని సంవత్సరాలు ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఇటీవల జిల్లాలో కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా వంతెన నిర్మాణ పనులు ఆలస్యంగా మొదలు పెట్టాల్సి వచ్చిందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు భవిష్యత్తులో ఈ జాతీయ రహదారిని ఫోర్‌లైన్ రహదారిగా మార్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ నూతన వంతెన నిర్మాణ పనులు రానున్న మే మాసంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు గజానంద్, కరుణాకర్‌రెడ్డి, విజయ్, అశోక్‌రెడ్డి, సన్నీ రాజు అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోనాల మంలంలోని పూలుసింగ్ నాయక్ తండా పార్డీ బి సోనాల గ్రామాల్లో మృతి చెందిన పలువురు కుటుంబాలను మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబాలను ఓదారించడంతో పాటు వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ నాయకులు సుధీర్‌రెడ్డి అభిలాష్ సోషల్ మీడియా కన్వీనర్ భీమ్రావు పాటిల్, మాజీ ఎ ంపీటీసీ రోహిదాస్, సీనియర్ నాయకులు సంతోష్, ఈశ్వర్, ప్రదీప్, కృష్ణ తదితరులున్నారు.

ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఆ హాస్టల్ వార్డెన్ నాండేవ్ ఉదయం పూట విద్యార్థులకు యోగ అభ్యాసనం చేయిస్తున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆరోగ్యం బాగుండాలని ఆరోగ్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణిస్తారని విద్యార్థులకు వివరించారు. ప్రతిరోజు అరగంటైనా నడక ఉండాలని దీంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు.



బోథ్ ఎస్టీ బాలుర వసతి గృహంలో యోగా నేర్పుతున్న హాస్టల్ వార్డెన్

అటవి హక్కుల అమలుకు యాక్షన్ ఎయిడ్ కృషి

ఉట్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల అటవి హక్కుల అమలు కోసం యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో కృషి చేయడం జరుగుతుందని హెచ్‌ఆర్‌డీ మర్సుకోల సరస్వతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాంజీగోండు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి 39 మంది ప్రతినిధులు పాల్గొనగా మర్సుకోల సరస్వతి ప్రసంగిస్తూ అటవి హక్కులు ఆదివాసుల ప్రాథమిక మక్కులు అని, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడం ప్రభుత్వశాఖల మరియు సమాజం యొక్క బాధ్యత అన్నారు. గ్రామస్థాయి అవగాహన, పత్రాల సేకరణ, సామాజిక హక్కులు, ఇండ్ల నిర్మాణం హక్కుల క్లెయిమ్‌లను వేగంగా పూర్తి చేయడం కోసం కమ్యూనిటీ మానవ వనరుల ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అటవి హక్కులల చట్టం (ఎఫ్‌ఆర్‌ఏ - 2006) అమలు, గ్రామసభల బలోపేతం, కమ్యూనిటీ హక్కుల కోసం వ్యూహాలు వంటి అంశాలపై చర్చించారు.సీహెచ్‌ఆర్‌డీలు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో దొంగచింత గ్రామ పటేల్ కుంరం జుగాదిరావు, రాజుగూడ, గ్రామ పటేల్ సోము, రాంజీగోండ్‌నగర్ గ్రామ పటేల్ కాత్‌లే హన్సేస్‌రావు, మడావి నీలాబాయి, ఆత్రంతీర్థ, కుంరం శ్రీదేవి, భక్తు రాజన్నలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షురాలు మర్సుకోల సరస్వతి

అలరించిన సాధనా శూరుల విన్యాసాలు

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం వద్ద ఆదివారం సాధనా శూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గత కొద్ది సంవత్సరాల కాలంగా పద్మశాలి సంఘం వారు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. సాధనా శూరుల విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా చూశారు.



బోథ్ మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం వద్ద సాధనా శూరుల విన్యాసాలు

పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నేడు చలో హైదరాబాద్

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదవి విరమణ పొందిన ఉద్యోగుల స మస్యల పరిష్కారం కోసం నేడు ఈ నెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెన్షన్ సంఘం జిల్లా అధ్యక్షులు సేరుసుధాకర్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజేశ్వర్‌రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మురళిధర్‌లు పేర్కొన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో ఇప్పటికే 40 మంది పదవి విరమణ పొందిన ఉద్యోగులు మృత్యువాత పడ్డారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పదేళ్ల రైతుల సమస్యకు చెక్

▸▸ ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాప్రీ గ్రామంలోని రైతులు పదేళ్ల పాటు రైతులు పడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం జరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండలం కాప్రీ గ్రామంలో వాగులో ఉన్నటువంటి కెనాల్‌లో ఉన్నటువంటి నీరుకు విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి నీటిని విడుదల కార్యక్రమాన్ని ఆదివారంప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ జైనథ్ మండలం కాప్రీ రైతులు వాగులో, కెనాల్‌లో ఉన్నటువంటి నీటికి విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేస్తే వాటిని వాడుకుని వ్యవసాయానికి ఉపయోగించుకుంటామంటే, పదేళ్ల పాటు డీడీలు కట్టి తిరిగిన, అధికారుల చుట్టూ తిరిగిన ఆ రైతుల పడ్డ కష్టాలు అంతా ఇంతా కాదన్నారు. 55 మంది రైతులు పడుతున్నటువంటి కష్టాలు బాధలు చూసి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకు రావడం జరిగింది అన్నారు. కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వందల కొద్ది కరెంట్ స్థంబాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జైనథ్ మండలం కాపీ రైతులకు మంచి జరగడం జరిగిందన్నారు. ఇప్పుడు అర్హతలు ఎంతో సంతోషంగా వ్యవసాయం చేసుకోవడం జరుగుతుందన్నారు. అలానే పంట చేన్‌లో వెళ్లేందుకు రోడ్లు సౌకర్యం లేదని వచ్చే బడ్జెట్ సమావేశంలో ఆలోచన చేసి ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ప్రతి చేనులో నీళ్ల సౌకర్యం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వాలని ప్రత్యేకంగా అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు రైతుల తరఫున తెలియజేశారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కనుగుట్ట బస్టాండ్ నుంచి రాత్రిపూట వెళ్లాలంటే భయం

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామం బస్టాండ్ నుంచి గ్రామంలోకి వె ళ్లేంత వరకు విద్యుత్ దీపాలు లేక పోవడంతో చిమ్మచీకటి నెలకొంది. గత ఆరు నెలల క్రితం బస్టాండ్ ప్రాంతంలో హైమాస్ లైట్లను ఏర్పాటు చేసిన అవి ఆరు నెలలకి మసక బారిపోయాయి.దీంతో బస్టాండ్ ప్రాంతమంతా చిమ్మచీకటిగా ఉంది. ఇక గ్రామంలోకి వెళ్లాలంటే అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉందని గ్రామస్థులంటున్నారు. గుతంలమయమైన రోడ్డు పైన అడుగు తీసి అడుగు వేయాలంటే ఎక్కడ ఏముందో తెలియని పరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపుల వ్యవసాయ పొలాలు ఉండడంతో అడవి పందులు ఎక్కడ నుంచి వస్తాయి తెలియని పరిస్థితి ఉందని గ్రామస్థులు అంటున్నారు. పంచాయతీ అధికారులు బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

బోథ్ అడవుల్లో పులి, చిరుతల సంచారం

నేటి నుంచి జిన్నింగ్ మిల్ యాజమానుల సమ్మె బాట 7

6 డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన

భజ గోవిందం కావ్యం ఆవిష్కరణ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆది శంకరాచార్యులు రచించిన శంకర్ విరచిత భజ గోవిందం సంస్కృతి భక్తి కావ్యాన్ని ఇచ్చోడ మండలానికి చెందిన గురుదాస్ మిట్టపల్లి శంకరయ్య తెలుగులో అనువదించారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మటంలో మఠాధి పతి యోగానంద సరస్వతి చేతుల మీదుగా తెలుగు కావ్యాన్ని ఆవిష్కరించారు. కావ్యంలోని అంశాలను అనువాదకర్త మిట్టపల్లి శంకరయ్య వివరించారు. ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని అలవరుచుకుని సన్మార్గంలో నడవాలన్న ఉద్దేశంతో సంస్కృతం నుంచి కావ్యాన్ని తెలుగులోకి అనువదించినట్లు తెలిపారు. కావ్యాన్ని పూర్తిగా అనువదించేందుకు నాలుగు సంవత్సరాల కాలం పట్టిం దని పేర్కొన్నారు.

కుచలాపూర్‌లో ఘనంగా బోనాల జాతర



అమ్మవారి బోనాల కొండలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు



ఆలయంలో అమ్మవారి మూల విరాట్

▸▸ ఆకట్టుకున్న శివ సత్తుల విన్యాసాలు
▸▸ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి
▸▸ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామంలో అడెల్లి పోచ్చమ్మ ఉపాసకులు మల్లయ్య దేవుడు నిర్మించిన పోచ్చమ్మ అమ్మవారి ఆలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు, ఊరి పొలిమేరలో ఉన్న గ్రామ దేవతకు గ్రామ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో సామూహిక బోనాలను భాజా భజంత్రీల నడుమ శివసత్తుల విన్యాసాలు చేస్తూ బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై బోనం ఎత్తుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఉపాసకులు మల్లయ్య దేవుడు అకుంఠిత దీక్షతో గ్రామంలో అడెల్లి పోచ్చమ్మ అమ్మవారి ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏడు రైతులు పంటలు పండించి ఇంటికి వచ్చిన సమయంలో కృతజ్ఞతతో గ్రామ దేవతకు బోనాలను సమర్పించే ఆనవాయితీ తీసుకురావడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అమ్మవారి ఉపాసకులు మల్లయ్య దేవుడు మాట్లాడుతూ జీవితం మొత్తం అమ్మవారి అరాధనకి అంకితం చేయడం జరిగిందని గత 40 సంవత్సరాలుగా అమ్మవారిని కొలుస్తున్నానని, గ్రామస్తుల సహకారం, అమ్మవారి భక్తులు, అమ్మవారి కృపతో ఆలయం నిర్మాణం చేపట్టి వార్షికోత్సవాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుచుకోవాలని కోరారు. అదేవిధంగా సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ దేవరావు, దేవాపూర్ మాజీ సర్పంచ్ అబ్దుల్లా రానవీర్ యాదవ్, జకుల శ్రీనివాస్, పిడుగు అభిరామ్ రెడ్డి, జనార్ధన్, జక్కుల రవీందర్, రాగి రాంకిషన్, తోట ప్రమోద్, తోట చందు. ఓం ప్రకాష్, శ్యాంసుందర్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, అధికార ప్రతినిధి కిరణ్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్